ప్రజాశక్తి
సోమవారం 10 ఫిబ్రవరి 2025 5
శ్రీ సత్యసాయి

నేడు మడకశిరలో కలెక్టర్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్

ప్రజాశక్తి - మడకశిర

నియోజకవర్గం కేంద్రంలో సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ పాల్గొననున్నారని స్థానిక శాసన సభ్యులు ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తెలిపారు సోమవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటవరకు మడకశిరలోని తహశీల్దార్ కార్యాలయంలో శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ అధ్యక్షతన జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నియోజకవర్గం ప్రజలు తమ వ్యక్తి గత సమస్యలు, సామజిక సమస్యలు, వారి గ్రామాలలో నెలకొన్న సమస్యలు అర్జీల రూపంలో సమర్పించుకోవచ్చని తహశీల్దార్లు కరుణాకర్, లక్ష్మీ నరసింహ, షేక్షావలి తెలిపారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయా మండలాల టిడిపి కన్వీనర్లు లక్ష్మీనారాయణ, గణేష్, మద్దనకుంటప్ప, కుమారస్వామి, దాసిరెడ్డి తెలిపారు.

మరిన్ని భూకేటాయింపులు

సోలార్, విండ్ ప్రాజెక్టులకు అనుమతి
కేటాయించిన మూడు సంస్థలు ఒక్కరివే
లీజు పద్ధతిలో భూసేకరణకు అనుమతి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఇప్పటికే ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెద్దఎత్తున సోలార్ ,విండ్ ప్రాజెక్టులకు భూములు కేటాయించారు. తాజాగా మరిన్ని ప్రాజెక్టులకు అనుమతులిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏకంగా 1478 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. వీటికి అవసరమైన భూ సేకరణను లీజు పద్దతుల్లో చేసుకునే వెసలుబాటును కల్పించింది. ఇప్పటికే ఆయా సంస్థలు భూములపై కన్నేయడమే కాకుండా చాలా వరకు లావాదేవీలు కొనసాగించుకున్నట్లు సమాచారం.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనుమతినిచ్చిన సంస్థలు, ప్రాంతాలు

అనంతపురం, కడప జిల్లాల పరిధిలోని తాడిపత్రి, కొండాపురం మండలాళ పరిధిలోని బొడాయపల్లి గ్రామం పరిధిలో సెయిల్ సోలార్ సంస్థకు 300 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి అనుమతినిచ్చింది. సత్యసాయి జిల్లా పరిధిలో ఎకరన్ ఎనర్జీ సంస్థకు రాళ్ళ అనంతపురం గ్రామం పరిధిలో 201 మెగావాట్ల విండ్ ఎనర్జీ విద్యుత్ ఉత్పత్తికి అనుమతినిచ్చింది. ఇదే సంస్థకు కనగానపల్లి మండలం మద్దెలచెరువు వద్ద 50 మెగావాట్ల విండ్, సోలార్ హైబ్రీడ్ ప్రాజెక్టుకు అనుమతినిచ్చారు. బెళుగుప్ప మండలం గంగవరం గ్రామం పరిధిలో 400 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పదానకు టాటా సంస్థకు అనుమతులిచ్చారు. కనగానపల్లి, రామగిరి మండలాల పరిధిలో ముత్తవకుంట, ఎలకుంట్ల, రామగిరి, నసనకోట గ్రామాల పరిధిలో కడప రెనీవబుల్స్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థకు 231 మెగావాట్ల అనుమతులిచ్చారు. కళ్యాణదుర్గం ప్రాంతంలోని అడవిగొల్లపల్లి, బచ్చుపల్లి, యాటకల్లు, నరసాపురం గ్రామాల పరిధిలో 178 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అనంతపురం రెన్యూవబుల్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థకు అప్పగించారు మక్కినవారలిపల్లి, మోటరుచింతలపల్లి, కురాకులపల్లి, పేరూరు, కొండాపురం గ్రామాల పరిధిలో ఆస్పిరి రెన్యూబుల్ ప్రయివేటు లిమిటెడ్ సంస్థకు 118 మెగావాట్లకు అనుమతినిచ్చారు.

ఆ మూడు సంస్థలు ఒక్కరివే : అనంతపురం రెన్యూబుల్ ప్రయివేటు లిమిటెడ్, ఆస్పిరి ప్రయివేటు లిమిటెడ్, కడప రెన్యూవబుల్ ప్రయివేటు లిమిటెడ్ మూడు సంస్థలు వేరువేరుగానున్నా అందులో డైరెక్టర్లు మాత్రం ఒక్కటే కావడం గమనార్హం. ఇంత పెద్దఎత్తున ఈ సంస్థలకు అనుమతులివ్వడంపై పలు సందేహాలు వ్యక్తం చేస్తుండటం గమనార్హం.

భ్రమజనిత బడ్జెట్

సంక్షేమానికి కోతలు
'కార్పొరేట్'కు ప్రయోజనాలు
కేంద్ర బడ్జెట్‌పై సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ భ్రమజనితమైందే తప్ప సామాన్యులకు మేలు చేసే విధంగా లేదని వక్తలు పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం, బిఎస్పీ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌పై సదస్సు జరిగింది. విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఎజి.రాజమోహన్, బిఎస్పీ నాయకులు నాగభూషణం అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ప్రముఖ సామాజికవేత్త సత్యబోసు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రజా సంక్షేమానికి, సామాజిక రంగానికి కోతలు పెట్టిందని చెప్పారు. వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నామని బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగించినంతగా కేటాయింపులు ఆ రంగంలో పెరగలేదని చెప్పారు. అంతకు మునుపు ఏడాది రూ.1.64 లక్షల కోట్లు కేటాయిస్తే ఈసారి రూ.1.67 లక్షల కోట్లు మాత్రమే కేటాయించారని వివరించారు. విద్య,వైద్యానికి అదే పరిస్థితి ఉందన్నారు. ఇక సామాజిక అభివృద్ధిని పూర్తిగా విస్మరించినట్లు ఈ బడ్జెట్ కనిపిస్తోందని చెప్పారు. 150 పథకాలు సామాజిక తరగతుల పరిధిలో ఉన్నాయన్నారు. వీటికి గతేడాది రూ.60 వేల కోట్లు కేటాయిస్తే ఈసారి రూ.56 వేల కోట్లు కేటాయించారని తెలిపారు. ఇందులో సఫాయి కర్మచారీ కార్పొరేషన్‌కు చూస్తే బడ్జెట్‌లో కేటాయింపులు కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే ఉన్నాయని చెప్పారు. దీంతో అణగారిన వర్గాల అభ్యున్నతి ఎలా సాధ్యమో కేంద్ర ప్రభుత్వమే చెప్పాల్సి ఉంటుందన్నారు. దేశంలో అత్యధిక మంది జీవనం సాగిస్తున్న గ్రామీణ ప్రాంతాభివృద్ధికి భారీగా కోతలు పెట్టిందన్నారు. సామాన్య ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఈ బడ్జెట్ ఏర్పాటు జరగలేదన్నది దీని ద్వారా స్పష్టమవుతుందన్నారు. ప్రొఫెసరు బావయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాన్యులకు పెద్దపీట వేసామని చెబుతున్నా ఆచరణలో లబ్ధిపొందుతున్నది పెద్ద కార్పొరేట్ సంస్థలేనని చెప్పారు. ఎంఎస్‌ఎంఇకి ఊతమిచ్చామని చెబుతున్నా ఆచరణలో చూసినప్పుడు ఈ ఎంఎస్‌ఎంఇల కింద లబ్ధిపొందుతున్నది పెద్ద కార్పొరేట్ కంపెనీలేనని చెప్పారు. మానవ హక్కుల వేదిక నాయకులు సుబ్బన్న మాట్లాడుతూ బడ్జెట్ అంటే ఆదాయ, వ్యయాలు మాత్రమే కాదన్నారు. ఆ ఏడాది కాలానికి ప్రభుత్వం పరంగా ప్రకటించే విధాన ప్రకటన అని చెప్పారు. ఇది ఆ రకంగా కాకుండా అంకెల గారడి పద్దతుల్లో నడుస్తోందన్నారు. ఈ బడ్జెట్ పన్ను మినహాయింపు రూ.12 లక్షలు వరకు ఇవ్వడం చూట్టే నడిచిందన్నారు. దీని వలన చేకూరే ప్రయోజనం అతి కొద్ది మందికి మాత్రమేనని చెప్పారు. ఎక్కువ మందికి సంబంధించిన చర్చ ఈ బడ్జెట్‌లో జరగలేదని పేర్కొన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ కార్పొరేట్లకు మేలు చేసే విధంగానున్న ఈ బడ్జెట్‌కు ప్రత్యామ్నాయ బడ్జెట్ గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని వామపక్ష పార్టీలు భావించాయని చెప్పారు. ఈనెల 14వ తేదీ నుంచి 23 వరకు ప్రచారోద్యమాన్ని రాష్ట్రంలో చేపట్టడం జరిగిందన్నారు. వ్యవసాయరంగాన్ని పూర్తిగా ప్రయివేటుపరం చేసే విధంగా ఈ బడ్జెట్ ఉందన్నారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు రాష్ట్రంలోనూ సాగుతున్నాయన్నారు. దీని వలన జరిగే నష్టాలను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ మాట్లాడుతూ కార్పొరేట్లకు సంపదన దోచే పెట్టే విధంగానున్న ఈ బడ్జెట్ గురించి ప్రజల్లోకెళ్లి వివరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఒ.నల్లప్ప, నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో పాల్గొన్న వక్తలు

ఎల్ఆర్‌జి విద్యాలయంలో కరాటే పోటీలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలోని కిరికెర యల్అర్‌జి. విద్యాలయంలో ఆదివారం జరిగిన కరాటే పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విద్యాలయ ఇండోర్ స్టేడియంలో సీనియర్ కరాటే మాస్టర్ రఫిక్ అహ్మద్ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ టెస్ట్ లు నిర్వహించారు. ఈ కరాటే బెల్ట్ టెస్ట్‌లో 87 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య పర్యవేక్షకులుగా గౌరిబిదనూర్ మాస్టర్ కే.బి.శ్రీనాథ్ పాల్గొన్నారు. విద్యార్థులకు కరాటే టెస్ట్‌లు నిర్వహించి 48 మందికి ఎల్లో బెల్ట్, 28 మందికి అరేంజ్ బెల్ట్, ఒకరికి గ్రీన్ బెల్ట్, ముగ్గురికి పర్పల్ బెల్ట్, ఐదుగురికి బ్రౌన్ బెల్ట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కరాటే శిక్షకులు రియాజ్ బాషా, జనార్ధన్ రెడ్డి, సాదిక్ బాషా, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులతో మాస్టర్లు

మున్సిపల్ ఛైర్మన్‌కు సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్‌ను పట్టణంలోని శ్రీకంఠపురంలో వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వడ్డెర యువజన సంఘం నాయకులు వార్డ్ కౌన్సిలర్ దుర్గ మంజుళ, నవీన్, ప్రెసిడెంట్ రంగప్పర, ప్రసాద్, సునీల్ కుమార్, వెంకటేష్ మాట్లాడుతు బిసి వర్గానికి చెందిన ఛైర్మన్ పదవిని ఇచ్చిన టిడిపి బిసిల పార్టీ అని నిరూపించిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కెంచప్ప, దుర్గ నాని, గంగాధర్, శివ, జయచంద్ర, శ్రీనివాస్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

అబాకస్‌లో 'పురం' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని డిబి కాలనీలో ఉన్న అబాకస్ కాన్సెప్ట్ సెంటర్ విద్యార్థులు ఆదివారం బెంగళూరులో కిడ్స్ కాన్సెప్ట్ నేషనల్ లెవెల్ కాంపిటీషన్‌లో ప్రతిభ కనబర్చినట్లు నిర్వహకులు శృతి రేచల్ తెలిపారు. తమ సెంటర్‌కు చెందిన 25 మంది ప్రతిభ కనబర్చడంతో అందరికి మెమోంటోలతో పాటు ప్రశంసా పత్రాలను అందించారన్నారు. అదే విధంగా అబాకస్ కిడ్స్ కాన్సెప్ట్ సెంటర్ నిర్వాహకురాలు శ్రుతి రేచల్‌కు బెస్ట్ ఫ్రాంచెస్ అవార్డ్‌ను నేషనల్ లెవెల్ కాంపిటీషన్ నిర్వాహకులు సచిన్ రావు అందించారు.

రైతుల సమస్యలు పట్టని ప్రభుత్వం : వైసిసి

ప్రజాశక్తి-హిందూపురం

అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని వైసిపి ఇన్చార్జ్ దీపిక వేణు రెడ్డి విమర్శించారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ అధికారంలోకి వస్తే 9 గంటలకు నాణ్యమైన విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఉదయం 3 గంటలు మధ్యాహ్నం మూడు గంటలు విద్యుత్ అందించి చేతులు దులుపుకుంటోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఏ ఒక్క రైతుకు సహాయం చేయలేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతుల బాధలను అర్థం చేసుకుని ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు.

మధ్యప్రదేశ్ ధార్ గ్యాంగ్ అరెస్టు

రూ.90 లక్షల బంగారు, వజ్రాభరణాలు, రూ.19,35,000 నగదు స్వాధీనం
దక్షిణ భారత దేశంలో ఈ గ్యాంగ్‌పై 32కు పైగా కేసులు

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

నగరంలోని శ్రీనగర్ కాలనీ శివారు ప్రాంతమైన రాజహంస స్వీట్ హోమ్స్‌లోని 3 విల్లాస్ లో జరిగిన చోరీ కేసును అనంతపురం పోలీసులు ఛేదించారు. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలలో మోస్ట్ వాంటెడ్ గా ఉన్న మధ్యప్రదేశ్ ధార్ గ్యాంగ్ ఈ చోరీలకు పాల్పడినట్లు అనంతపురం పోలీసులు తేల్చారు. ధార్ గ్యాంగ్‌కు చెందిన ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.90 లక్షల విలువ చేసే బంగారు, వజ్రాభరణాలు, రూ.19 లక్షల 35 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం అరెస్టయిన ముగ్గురిలో గ్యాంగ్ లీడర్‌పై ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలలో 32 కేసులు నమోదయ్యాయి. ఆదివారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ పి.జగదీష్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

స్థానిక శ్రీనగర్ కాలనీ శివారు ప్రాంతమైన రాజహంస స్వీట్ హోమ్స్ లోని శివారెడ్డి, రంజిత్ రెడ్డి, శివశంకర్ నాయుడు ఇళ్లల్లో జనవరి 22వ తేదీన చోరీలు జరిగాయి. ఇళ్లకు తాళం వేయడంతో ఎవరూ లేనిసమయంలో చొరబడి సుమారు రూ. 2.13 కోట్లు విలువ చేసే బంగారు వస్తువులు, వజ్రాభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. ఈ కేసుల్లో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక 4 వ పట్టణ పోలీసులు కేసులు నమోదు చేసుకున్నారు. ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జిల్లా ఎస్పీ పి.జగదీష్ 4 పోలీసు బృందాలను రంగంలోకి దించి మధ్యప్రదేశ్ మారుమూల గ్రామాలలో సైతం జల్లెడ పట్టించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లా చడ్‌వాడు గ్రామానికి చెందిన నారుపచావర్, సావన్ అలియాస్ శాంతియదుడ్యే, మహమ్మద్, మోట్ల ఈ నలుగురు కలసి గత నెల 16 వ తేదీన తమ స్వగ్రామం నుండి దొంగతనాలు చేయాలనే ఉద్దేశ్యంతో బయల్దేరి జనవరి 21వ తేదీ ఉదయం అనంతపురం చేరుకున్నారు. స్థానిక శ్రీనగర్ కాలనీ శివారు ప్రాంతమైన రాజహంస స్వీట్ హోమ్స్ లో తాళం వేసిన ఇళ్లపై రెక్కీ చేశారు. ఆ విల్లాస్ లో ఉన్న శివారెడ్డి, రంజిత్ రెడ్డి, శివశంకర్ నాయుడు ఇళ్లను టార్గెట్ చేసుకున్నారు. నారు పచావర్, సావన్ ,మహబత్, మోట్ల కలసి 22వ తేదీ తెల్లవారుజామున ఆ మూడిళ్లకు తాళాలు పగులగొట్టి ఆ ఇంట్లో చొరబడ్డారు. ఆ ఇళ్లల్లో ఉన్న విలువైన బంగారు, వజ్రాభరణాలు, నగదు ఊడ్చుకెళ్లారు. చోరీ తర్వాత హైదరాబాద్‌కు బైకులలో వెళ్లి దొంగ సొత్తు వాటాలుగా పంచుకున్నారు. నారు పచావర్, సావన్ హైదరాబాద్‌లో ఉంటూ దొంగ సొత్తును విక్రయించే ప్రయత్నం చేయగా కుదర్లేదు. అక్కడ అమ్మడం అసాధ్యమని భావించి దొంగలించిన సొమ్మును బెంగుళూరులో అమ్మే ప్రయత్నం చేసి విఫలమయ్యారు. చివరకు మధ్యప్రదేశ్ కు చెందిన రిసీవర్ రమేష్‌ను ఫోన్లో సంప్రదించి చోరీ సొమ్మును కొనాలని కోరారు. రమేష్ దొంగ సొత్తులను కొనడంలో దిట్ట కావడంతో తనకు కుదరక తన కొడుకైన సునీల్‌ను పంపాడు. ఈ ముగ్గురు స్థానిక రాయల్ నగర్‌లో బేరం చేసుకుంటుండగా జిల్లా ఎస్పీకి సమాచారం అందింది. అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సిఐలు కనుమూరి సాయినాథ్, హేమంత్ కుమార్, జయపాల్ రెడ్డి, ఎస్ఐలు రాంప్రసాద్, రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది బృందంగా ఏర్పడి ఆదివారం రాయల్ నగర్ సమీపంలో అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లా చడ్‌వాడు గ్రామానికి చెందిన నారుపచావర్, సావన్ అలియాస్ శాంతియదుడ్యే, పిపాల్డిల్యా గ్రామానికి చెందిన సునీల్ ఉన్నారు. గ్యాంగ్‌లోని మహబత్, మోట్ల ఇద్దరూ పరారీలో ఉన్నారు. వీరి వద్ద నుంచి రూ.90 లక్షల విలువ చేసే బంగారు, వజ్రాభరణాలు, రూ.19 లక్షల 35 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

స్వాధీనం చేసుకున్న సొమ్మును చూపుతున్న ఎస్పీ, తదితరులు

ఇదిలా ఉండగా అనంతపురం చోరీల్లో పాల్గొన్న మహబత్, మోట్ల హైదరాబాద్‌లో నారు పచావర్, సావన్‌తో దొంగసొత్తును వాటాలుగా పంచుకున్న తర్వాత వారి స్వగ్రామానికి వెళ్లారు. రిసీవర్ సునిల్ తండ్రి అయిన రమేష్ కూడా పరారీలో ఉన్నట్లు విచారణలో తేలింది. ప్రస్తుతం అరెస్టయిన ముగ్గురు, పరారీలో ఉన్న ఇద్దరు కూడా పాత నేరస్తులే. ఈ ఐదుగురిలో నారు పచావర్, మహబత్ లు ముఖ్యులు. స్వయాన ఇద్దరూ అన్నదమ్ములు. వీరికి మిగితా ముగ్గురు సోదరులుంటే వారు కూడా నేరస్తులే. ప్రస్తుతం వారు కూడా హైదరాబాద్ లోని జైలులో ఉంటున్నారు. నారు పచావర్ పై ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలలో సుమారు 32 కేసులు ఉన్నట్లు సమాచారం.మహబత్ పై కూడా నాలుగు రాష్ట్రాలలో సుమారు 29 కి పైగా కేసులున్నాయి. సావన్, సునీల్, మోట్లలపై కూడా కేసులు ఉన్నాయి. సునీల్ పై 9 కేసులు, ఈయన తండ్రి రమేష్ పై కూడా ఆంధ్ర, కర్నాటక, తమిళనాడు, తెలంగాణ, గుజరాత్ రాష్ట్రాలలో సుమారు 34 కేసులు ఉన్నట్లు వెల్లడైంది. వీరు అంతర్రాష్ట్ర దొంగలు. పరారీలో ఉన్న గ్యాంగ్ సభ్యుల కోసం గాలింపు ప్రక్రియ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

4 రాష్ట్రాలలో ధార్ గ్యాంగ్ మోస్ట్ వాంటెడ్

ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలలో ధార్ గ్యాంగ్ మోస్ట్ వాంటెడ్‌గా ఉంటోంది. ప్రస్తుతం పట్టుబడిన ముగ్గురు, పరారీలో ఉన్న ఇద్దరితో పాటు సుమారు 60 మంది దాకా ఈ గ్యాంగ్ లో సభ్యులు. అయితే ఐదారుగురు కలిసి గ్యాంగ్ గా ఏర్పడి చోరీలు చేస్తారు. వీరంతా కూడా మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లా టాండ పోలీసు స్టేషన్ పరిధిలోని గ్రామాలకు చెందిన వారే.

ప్రత్యేక పోలీసు బందాలకు ఎస్పీ ప్రశంస : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల పోలీసులకు మోస్ట్ వాంటెడ్ గా ఉంటూ పలు చోరీలకు పాల్పడిన ధార్ గ్యాంగ్ ను అరెస్టు చేసిన అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సిఐ లు కనుమూరి సాయినాథ్, హేమంత్ కుమార్, జయపాల్ రెడ్డి, ఎస్ఐలు రాంప్రసాద్, రాజశేఖర్ రెడ్డిల ఆధ్వర్యంలో పనిచేసిన సిబ్బందిని ఎస్పీ పి.జగదీష్ అభినందించారు.

లక్ష్యంతో ముందుకు సాగాలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు ఒక లక్ష్యం ఎంచుకొని ఆ లక్ష్యసాధన కోసం ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే విజయం వారి వెంటే ఉంటుందని ప్రముఖ మోటివేటర్ వేణు కళ్యాణ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఈడి ప్యాలెస్ లో సువర్ణ భారతి విద్యా సంస్థల ఆధ్వర్యంలో మోటివేషన్ స్పీచ్, సక్సెస్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాదుకు చెందిన ప్రముఖ మోటివేటర్ వేణు కళ్యాణ్ మాట్లాడుతూ చిన్న విషయాలకు జీవితంలో ఏదో కోల్పోయామని ఆత్మహత్యలకు పాల్పడడం పిరికితనం అన్నారు. ప్రతి విద్యార్థి ఎవరో ఒకరిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ముఖ్యంగా తమ పిల్లల వృద్ధి కోసం తల్లిదండ్రులు చేసే త్యాగాల గురించి సమగ్రంగా వివరించారు. మరో 20 రోజుల్లో ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయని, ఆ పరీక్షల్లో మంచి మార్కులను సాధించాలని ప్రతి విద్యార్థి సంకల్పించే ముందుకు సాగితే ప్రతి ఒక్కరికి మంచి మార్కులు వస్తాయన్నారు. విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు, సువర్ణ భారతి కళాశాల ప్రిన్సిపల్ నీలకంఠారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రులు కన్న కలలను సాకారం చేయాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థి పై ఉందన్నారు. అనంతరం వేణు కళ్యాణ్ కు కళాశాల తరపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల ఏవో అనిల్ కుమార్, రవీంద్రారెడ్డి, లోటస్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ రజిత్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేణుకళ్యాణ్ కు పుష్ప గుచ్ఛం అందిస్తున్న నీలకంఠా రెడ్డి, తదితరులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

డిఎంహెచ్‌ఓ ఫిరోజ్‌బేగం

డిఎంహెచ్‌ఓ ఫిరోజ్‌బేగం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

కాలానుగుణంగా వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తతో ఉండాలని వేసవిని దృష్టిలో ఉంచుకొని వృద్ధులు, పిల్లలు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీ సత్యసాయి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఫిరోజ్ బేగం పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : సీజనల్ వ్యాధులు, విజృంభనపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

జవాబు: శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు అదుపులోనే ఉన్నాయి. ఇటీవల ప్రాథమిక ఆరోగ్యశాఖ సిబ్బంది పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సర్వేలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మలేరియా, డెంగీ, పిల్లలకు మధుమేహం వ్యాధులు అదుపులోనే ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మలేరియా కేసులు ఐదు ఉండగా డెంగీ కేసులు మూడు గుర్తించాం. వారు చికిత్సలు పొందుతున్నారు. 104 సిబ్బంది ద్వారా గ్రామాల్లో బిపి, షుగర్, క్యాన్సర్ వంటి పరీక్షలను ఎత్తు బరువు పరీక్షించి ఆహార అలవాట్లను పరిశీలిస్తూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎండాకాలం వడదెబ్బ వాంతులు విరోచనాలు నీరు కలుషితం వలన వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పిస్తున్నాం.

ప్ర : జిల్లాలోని లెప్రసీ కేసులు ఎన్ని ఉన్నాయి.?

జ: జిల్లాలో లెప్రసీ కేసులు గుర్తించడానికి జనవరి 20 నుండి ఫిబ్రవరి 2వ తేదీ వరకు సర్వే నిర్వహించాం. స్పర్శ లేని మచ్చలు కలిగిన వ్యక్తులను గుర్తించి వ్యాధి నిర్ధారణ అయితే వారికి ప్రభుత్వం నుండి ఉచితంగా మందులను అందజేసి వ్యాధిని అదుపు చేస్తాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సర్వేలు నిర్వహించి జిల్లావ్యాప్తంగా 3621 కేసులు గుర్తించగా వాటిలో 1341 కేసులను పరీక్షించగా అందులో ఐదు కేసులు మాత్రం నిర్ధారణయ్యాయి. గతంలో గుర్తించిన కేసులను సైతం పరిశీలించి పరీక్షలు నిర్వహించారు.

ప్ర : పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు అందుబాటులో ఉండన్న ఆరోపణల పై మీ అభిప్రాయం.?

జ : జిల్లా వ్యాప్తంగా ఏరియా ఆసుపత్రులలో 24 గంటలు డాక్టర్ అందుబాటులో ఉంటున్నారు. షిఫ్టుల ప్రకారం వచ్చి వెళుతుంటారు. అదేవిధంగా అర్బన్ హెల్త్ సెంటర్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారు. పలు కేంద్రంలో డాక్టర్లు అందుబాటులో ఉండరన్న మాట అవాస్తవం. జిల్లా అధికారులు తరచూ ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంపియన్ల ద్వారా విజిట్లు నిర్వహిస్తున్నారు. విధులకు హాజరు కాని వారిపై తమ దృష్టికి వస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

ప్ర : జిల్లా వ్యాప్తంగా సిబ్బంది ,మందుల కొరత ఉందా?

జ: శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఎలాంటి మందుల కొరత లేదు. జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 47, వుండగా వాటిలో 26 మంది స్టాఫ్ నర్సుల కొరత ఉంది. రామగిరిలో డాక్టర్ లేరు. వాటిని భర్తీ చేయడానికి అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నియామకాలు జరిపి సిబ్బంది కొరత అధిగమిస్తాం.

ఉమ్మల చంద్రశేఖర్ ఘనంగా అవార్డు, ప్రశంసా పత్రంతో సత్కరిస్తున్న ప్రముఖులు

విశ్రాంత ఉపాధ్యాయుడికి నంది అవార్డు

ప్రజాశక్తి-బత్తలపల్లి

రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన వారికి త్యాగరాయ గానసభ, చిక్కడపల్లి, హైదరాబాద్‌లో ఆదివారం 'బంగారునంది' అవార్డు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అందులో భాగంగా 'తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవాసంస్థ' విజయవాడ ఆధ్వర్యంలో బత్తలపల్లికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు, టిడిపి కార్యకర్త ఉమ్మల చంద్రశేఖర్ ఘనంగా సన్మానించారు. వారు ఆయనను పూలమాలలు, శాలువాలతో సత్కరించి 'బంగారునంది', ప్రశంసా పత్రాలు అందజేశారు. ఉమ్మల చంద్రశేఖర్ 37 ఏళ్ల పాటు ఉపాధ్యాయుడిగా ఉత్తమ సేవలందించినందుకు, పేద విద్యార్థులకు ఫీజులు, బుక్స్ అందించడం, వృద్ధుల కోసం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం, కరోనా సమయంలో పేదలకు నిత్యావసర సరుకులు అందజేయడం, తదితర సేవా కార్యక్రమాలు చేసినందుకు ఈ అవార్డు అందజేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ సీఈఓ డాక్టర్ రత్నం, డాక్టర్ ఉషారాణి, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లాంఛనాలతో హెడ్ కానిస్టేబుల్ అంత్యక్రియలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ నారాయణనాయక్ అంత్యక్రియలు ఆదివారం మండలంలోని పెడపల్లి గ్రామంలో ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. జిల్లా ఎస్పీ వి.రత్న కానిస్టేబుల్ మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు. నారాయణనాయక్ 1993లో పోలీస్ కానిస్టేబుల్‌గా చేరి వివిధ ప్రాంతాల్లో పని చేశారు. ఉద్యోగోన్నతి రావడంతో హెడ్ కానిస్టేబుల్‌గా అనంతపురం టూ టౌన్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించేవారు. ఆయనకు భార్య శాంతాబాయి, ఓ కుమారుడు, ఓ కూతురు ఉన్నారు. అంత్యక్రియల్లో అనంతపురం టూ టౌన్ సిఐ శ్రీకాంత్, పుట్టపర్తి రూరల్ ఎస్ఐ లింగన్న పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యకుమార్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, హరినాథ్, లక్ష్మీనారాయణ, గాండ్ల హరినాథ్, సిబ్బంది బ్యాచిమేట్లు, బంధువులు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న వాల్మీకి సేవాసమితి నాయకులు

మంత్రిని కలిసిన వాల్మీకి సంఘం నాయకులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై ఆదివారం వాల్మీకి సేవాసమితి నాయకులు రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బంగారు కృష్ణమూర్తి, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జల్లేని అంజనాదేవి, రాయలసీమ జిల్లాల మహిళా విభాగం కార్యదర్శి ప్రమీల, జిల్లా అధ్యక్షులు మల్లెం అశోక్, రాష్ట్ర అధికార ప్రతినిధి మేకల శివప్రసాద్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ధోనకొండ ఆనంద్, వాల్మీకి కుటుంబ సభ్యులు ఉన్నారు. వారు కదిరి నుంచి రాయచోటికి వెళ్లి మంత్రిని కలిశారు. కృష్ణమూర్తి మాట్లాడుతూ వాల్మీకి, బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తున్నామని, అందులో భాగంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి వినతిపత్రి ఇచ్చామని తెలిపారు.

గుంటూరు మేయర్ అభ్యర్థికి అభినందనలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

గుంటూరు మేయర్ అభ్యర్థిని కలిసిన టిడిపి నాయకులు

జోనల్ ఇన్‌ఛార్జి కోవెలమూడి రవీంద్ర నానిని గుంటూరు మేయర్ అభ్యర్థిగా ప్రకటించడంపై జిల్లా టిడిపి నాయకులు సిమెంట్ పోలన్న, జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు జరిపిటి కృష్ణమూర్తి అభినందనలు తెలిపారు. రవీంద్రను మేయర్ అభ్యర్థిగా ప్రకటించడంపై సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. అలాగే గుంటూరులోని రవీంద్ర నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. వారు మాట్లాడుతూ టిడిపి బిసిలకు సముచిత స్థానం ఇవ్వడంలో మాట నిలుపుకుంటుందని, ఇప్పటికే ఎంతోమంది బిసిలకు అత్యున్నత పదవులు కల్పించిందన్నారు.

నేడు ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

విద్యుత్ నియంత్రికల(ట్రాన్స్‌ఫార్మర్) కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న రైతులకు సోమవారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ట్రాన్స్‌ఫార్మర్లు అందజేస్తారని ఎమ్మెల్యే పిఎ లక్ష్మీనారాయణ తెలిపారు. కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి మండలాల పరిధిలోని రైతులు విద్యుత్ నియంత్రికల కోసం ఎంతో కాలం నుంచి ఎదురుచూస్తున్నారని వారికి అందజేస్తారన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులు సోమవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సబ్‌స్టేషన్ భవనం ప్రారంభం

కొత్తచెరువు : కొత్తచెరువులో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్ భవనాన్ని సోమవారం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ప్రారంభిస్తారని విద్యుత్ ఏఈ వెంకటేష్‌నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో రైతులు, కూటమి శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎంఎండిఎ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని ముస్లిం మైనార్టీ డెవలప్మెంట్ అసోసియేషన (ఎంఎండిఎ) కార్యాలయంలో ఆదివారం ఇటీవల గణతంత్ర దినోత్సవం సందర్భంగా అనంతపురం జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తమ సేవా అవార్డు అందుకున్న ఎంఎండిఎ ఫౌండర్, జిల్లా అధ్యక్షులు ఎంఎండి ఇమామ్‌ను అసోసియేషన్ జిల్లా సభ్యులు ఘనంగా సన్మానించారు. ఇమామ్ మాట్లాడుతూ పేదలు, నిస్సహాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో ఎంఎండిఎ సంస్థను స్థాపించామన్నారు. రిపబ్లిక్ డే రోజున కలెక్టర్ నుంచి ఉత్తమ సేవా అవార్డు అందుకోవడం మరింత బాధ్యత పెంచిందన్నారు. కార్యక్రమంలో జిల్లా సలహాదారు హాజీబషీర్‌అహ్మద్, రోషన్‌జమీర్, డివిజన్ ప్రెసిడెంట్ దాదాపీర్, టౌన్ ప్రెసిడెంట్ ఫారూఖ్, సభ్యులు జిక్రియ, మస్తాన్, కలీం, షామీర్, నిజాం, షబ్బీర్, జాఫర్, సమీర్, ముంతు, హనీఫ్, హాజీపీరా పాల్గొన్నారు.



సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ధర్మవరం యం యం డి ఏ నాయకులు

భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి : ఆర్డీవో

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఆర్డీవో మహేష్

ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో రైతులు భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీవో మహేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మీసేవ, గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. వేగంగా ప్రామాణికమైన విధానాన్ని అందు బాటులోకి తెచ్చేలా రెవెన్యూ యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. డివిజన్ పరిధిలో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి ముందడుగు పడిందన్నారు. దీనివల్ల నిరుపేదలకు లబ్ధి చేకూరుతుందన్నారు. క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేరిట మాత్రమే పంపిణీ చేస్తామన్నారు. నిర్దేశించిన ధ్రువీకరణ పత్రాలతో మీ సేవా కేంద్రాల్లో అప్‌లోడ్ చేయాలన్నారు. 2019 అక్టోబర్ 15ను ప్రామాణిక తేదీగా తీసుకొని ఆ తేదీ కంటే ముందు ఆక్రమణలో ఉన్న భూములను నిబంధనలు అనుసరించి క్రమబద్ధీకరిస్తామన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉండి 151 నుంచి 300 గజాలలోపు ఆక్రమణలకు బేసిక్ ధరలో 15 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న వారు 200 శాతం బేసిక్ ధర, పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. 450 గజాలకు మించిన ఆక్రమణలో ఎవరు ఉన్నప్పటికీ బేసిక్ ధరకు 5 రెట్లు, వంద శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి క్రమబద్ధీకరిం చుకోవాల్సి ఉంటుందన్నారు. అర్హుల జాబితా ఖరారైన తర్వాత ఆ వివరాలను తహశీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపుతామన్నారు.

లేపాక్షి : మండలంలో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ సౌజన్యలక్ష్మి తెలిపారు. మీ సేవా కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేరిట మాత్రమే జారీ చేస్తామన్నారు.

ముస్లింలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తనకల్లు

ముస్లింల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట

ముస్లిం మైనారిటీలకు ఎప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. మండలంలోని మండ్లిపల్లి మిట్ట మీద ఉన్న ఎస్ఎంఎన్ ఫంక్షన్ హాలులో ఆదివారం ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే కందికుంట ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా మండల ముస్లిం మైనార్టీ ఇమామ్‌లు, మౌజాన్లు కందికుంటను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలు తన గెలుపు కోసం చిత్తశుద్ధితో పని చేశారని, వారికి ఎప్పుడూ రుణపడి ఉంటానని తెలిపారు. ఇమామ్‌లు, మౌజాన్లకు ఇల్లు నిర్మించి ఇస్తామన్నారు. అలాగే తనకల్లులో శ్మశానవాటికకు ప్రహరీతో పాటు ప్రతి మండలానికి ఒక షాదీమహల్ కట్టిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ తొట్లి రెడ్డి శేఖర్‌రెడ్డి, మస్తాన్, టిడిపి నాయకులు కావడి ప్రవీణ్‌కుమార్, సోంపాలెం నాగభూషణ, కుంచె నాగేంద్రప్రసాద్, మైనార్టీ నాయకులు మహబూబ్‌బాషా, హిదాయతుల్లా, దస్తగిరి, జియాఉల్లా, అలీ, మహిళలు పాల్గొన్నారు.

ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : గుండుమల

ప్రజాశక్తి-మడకశిర

మసీదు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న గుండుమల తిప్పేస్వామి

ముస్లింల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామి తెలిపారు. పట్టణంలో ఆదివారం జామియా మసీదు ప్రారంభోత్సవ కార్యక్రమంలో గుండుమల పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం మసీదు నిర్మాణాలకు, ముస్లిం మైనార్టీల అభివృద్ధికి ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. టిప్పు సుల్తాన్ పరిపాలన కాలంలో దాదాపు 250 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన జామియా మసీదును ముస్లింలు నూతన హంగులతో నిర్మించడం పట్ల అభినం దించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు భక్తర్‌సాబ్, మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, దాసిరెడ్డి, నాయకులు ఓబులేసు, మాధవరాజు, కౌన్సిలర్ ఉమాశంకర్, తిమ్మరాజు, ముస్తఫా, మహబూబ్‌బాషా, సక్లయిన్, నజీర్, అసదుల్లా, కార్యదర్శి ఈరన్న, ముస్లింలు పాల్గొన్నారు.

హిందూ, ముస్లింలు సోదరభావంతో మెలగాలి

సమాజంలో హిందూ ముస్లింలు సోదర భావంతో అన్నదమ్ముల్లా మెలగాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ మంత్రి రఘువీరారెడ్డి తెలిపారు. మసీదు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న రఘువీరారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎలాంటి వర్గ విభేదాలు లేకుండా హిందూ ముస్లింలు సోదర భావంతో మెలుగుతున్నారన్నారు. మనమందరం ఎప్పుడూ కలిసి మెలిసి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, కన్వీనర్ మంజునాథ్, డాక్టర్ రవిశంకర్, బిజెపి నాయకులు పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కంటి వెలుగులు పంచడమే ధ్యేయం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

శిబిరంలో వైద్యులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ నిర్వాహకులు

పేదలకు కంటి వెలుగు ప్రసాదించడం అదృష్టంగా భావిస్తున్నామని రోటరీ క్లబ్ అధ్యక్షులు జయసింహ, కార్యదర్శి నాగభూషణ, కోశాధికారి సుదర్శన్‌గుప్తా తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి శస్త్రచికిత్స శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రోటరీ క్లబ్, శంకర కంటి ఆసుపత్రి–బెంగళూరు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించామన్నారు. దాతలుగా వ్యవహరించిన చింతలూరు సత్యనారాయణ, పద్మావతమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు, కోడళ్లు (సత్యకృప సిల్క్స్–ధర్మవరం)ను సత్కరించారు. శిబిరంలో ఉచిత వైద్య చికిత్సతో పాటు శిబిరానికి వచ్చిన వారందరికీ కంటి వైద్యులు నిర్వహించామని డాక్టర్ హేమంత్ తెలిపారు. కంటిపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఇన్నర్ వీర్ క్లబ్ ఐఎస్ఓ రాజేశ్వరి, నరేందర్‌రెడ్డి, బండారు చలం, కొండయ్య, సత్రశాల ప్రసన్నకుమార్, శివయ్య, గట్టు హరినాథ్, బి.శ్రీనివాసులు, పెరుమాళ్ల దాస్, జయచంద్ర, మనోహర్‌గుప్తా, బత్తలపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

చెస్ పోటీల విజేతలకు జ్ఞాపిక అందజేసిన నిర్వాహకులు

పట్టణంలోని శ్రీఉషోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 7వ స్టేట్ లెవెల్ ఓపెన్ చెస్ టోర్నమెంటు పోటీలు ఆదివారం విజయవంతంగా ముగిశాయని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు షీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి వెంకటాద్రి మోహన్, పీఆర్వో రాధాకృష్ణ తెలిపారు. వారు మాట్లాడుతూ పోటీలకు వివిధ జిల్లాల నుంచి మొత్తం 270 మంది చెస్ క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. ముఖ్యఅతిథిగా రైల్వే ఆర్‌పిఎఫ్ సిఐ బోయ కుమార్, ఏపీ స్టేట్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి సుమన్, టోర్నమెంట్ ప్రెసిడెంట్ డాక్టర్ బివి.సుబ్బారావు హాజరయ్యారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన కె.దుర్గాప్రసాద్, టి.అఫ్రిద్‌ఖాన్, కె.భరత్‌భూషణ్‌లకు ముఖ్యఅతిథులు నగదు బహుమతితో పాటు ట్రోఫీలు, మెడల్స్, షీల్డ్‌లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సుంకు సుకుమార్, కోశాధికారి వంకదారి మోహన్, రమేష్‌బాబు, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ చాంద్‌బాషా, వ్యవస్థాపక అధ్యక్షులు పోలా ప్రభాకర్, వైకె.శ్రీనివాసులు, కోటేశ్వరరావు, రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నేతృత్వంలో అభివృద్ధి పథంలో ఏపీ : పల్లె

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

రాష్ట్రంలో సమర్థవంతమైన నాయకత్వం ఉండడం వల్లనే ఏపీ అభివృద్ధి పథంలో సాగుతుందని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం పలు వివాహాలకు హాజరయ్యారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ నాయకత్వంలో ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి పడుగులు పెడుతుందన్నారు. వైసిపి హయాంలో జగన్ ప్రజల సొమ్ముతో విలాసవంతమైన కార్యక్రమాలు చేపట్టడం వల్లే రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలోకి పోయిందని గుర్తుచేశారు. ఆయన వెంట నాయకులు విజయకుమార్, శ్రీనివాసులు, రామకృష్ణ, సాలెక్కగారి శ్రీనివాసులు, సామకోటి ఆదినారాయణ, శ్రీరామ్‌రెడ్డి, పుల్లప్ప, శ్రీరామ్‌నాయక్, బొమ్మయ్య, జయప్రకాష్, బేకరీ నాయుడు, గంగాధర్‌నాయుడు, రామారావు ఉన్నారు.

నిడిమామిడిలో వీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రతిష్టాపన చేసిన వీరభద్రస్వామి విగ్రహం

మండలంలోని నిడిమామిడి గ్రామ సమీ పంలో వెలసిన వీరభద్ర స్వామి విగ్రహ పున:ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. చెన్నబసవయ్య స్వామి పురోహితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున 3:30 నుంచి 5 గంటల వరకూ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రామ్మోహన్

ప్రజాశక్తి-కదిరిటౌన్

గ్రామపంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర నూతన ఉపాధ్యక్షుడిగా తనను ఎన్నుకున్నట్లు కదిరి పట్టణానికి చెందిన రామ్మోహన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రామ్మోమన్ ప్రస్తుతం జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర నాయకత్వం తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన వాటిని అందేలా కృషి చేస్తానని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఘనంగా కోడి రంగనాథస్వామి రథోత్సవం

ప్రజాశక్తి-లేపాక్షి

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మండలంలోని సిరివరం గ్రామంలో వెలసిన పురాతన కోడిరంగనాథస్వామి బ్రహ్మరథోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండు రోజుల నుంచి దీపారాధనలు, జ్యోతుల ఊరేగింపు, హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచి నేత్రావతి, లేపాక్షి ఆలయ కమిటీ ఛైర్మన్ కరణం రమానందన్, టిడిపి మండల కన్వీనర్ జయప్ప, మాజీ ఎంపిపి ఆనంద్‌కుమార్, సిరివరం కిష్టప్ప పాల్గొన్నారు.

నేడు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

ధర్మవరం రూరల్ : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న 1–19 ఏళ్ల లోపు పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తామని ఆదివారం ఎంఇఒలు ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తేదీ అందుబాటులో లేని వారికి 17వ తేదీ మాత్రలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

తలుపుల : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థల్లో 1–19 ఏళ్లలోపు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేస్తామని డాక్టర్లు అల్తాఫ్, అశ్రిత తెలిపారు.

టిడిపి కార్యాలయం ప్రారంభం

కదిరిటౌన్ : పట్టణంలోని నిజాం వలి కాలనీలో 15వ వార్డు ఇన్‌ఛార్జి హైదర్‌వలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టిడిపి కార్యాలయాన్ని ఆదివారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు పర్వీన్‌బాను, పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, మాజీ కౌన్సిలర్ ఖాదర్‌బాషా, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో 150 చీనీ చెట్లు దగ్ధం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

మండలంలోని ఆర్ ఎర్రగుంటపల్లిలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలరో రైతుకు చెందిన 150 చీనీచెట్లు దగ్ధం అయ్యాయి. గ్రామానికి చెందిన రైతు లక్ష్మీనారాయణ రెడ్డి తోటలో వున్న కొండకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఆమంటలు చీనీచెట్లకు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో రైతుకు చెందిన 150 చీనీచెట్లు దగ్ధం అయ్యాయి. అలాగే డ్రిప్ పరికరాలు, పైపులు కాలిపోయాయని రైతు వాపోయారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేపట్టిన్లు ధర్మవరం రూరల్ పోలీసులు తెలిపారు.

నేరాలు ఘోరాలు

వక్కతోటలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-మడకశిర

రొళ్ల మండలంలోని దాసప్పపాలెం గ్రామానికి చెందిన నాగరాజు తోటలో ఆదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో వక్క, టెంకాయ చెట్లతో పాటు డ్రిప్ పరికరాలు కాలిబూడిద కావడంతో రూ. లక్షల నష్టం జరిగిందని బాధిత రైతు నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతోనే ఈ ప్రమాదం జరిగిందని, దాదాపు మూడేళ్లు పెంచిన 50 వక్క చెట్లు, 5 టెంకాయ చెట్లు, డ్రిప్ పరికరాలు కాలిపోయాయని వాపోయాడు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రైతు నాగరాజు కోరారు.

మొబైల్ షాపులో షార్ట్ సర్క్యూట్.. రూ. 15 లక్షల నష్టం

ప్రజాశక్తి-కదిరి టౌన్

ప్రమాదవశాత్తూ మొబైల్ షాపులో విద్యుత్ ప్రమాదం సంభవించి రూ. 15 లక్షల నష్టం వాటిల్లిన సంఘటన ఆదివారం పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో నివాసం ఉంటున్న షేక్ నూర్ మహమ్మద్ వలిసాబ్ రోడ్డులో 'గెలాక్సీ' మొబైల్ షాపు నడిపేవాడు. ఉదయం 10 గంటల సమయంలో షాపులో పని చేసే అఫ్రిద్ దుకాణం తెరిచి ఉంచి టిఫిన్ తినేందుకు బయటికి వెళ్లిన సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూటై అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో సుమారు రూ. 15 లక్షల విలువ చేసే సెల్‌ఫోన్లు, ఇతర వస్తువులు కాలిపోయినట్లు బాధితుడు వాపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్పందించి బాధితుడికి న్యాయం జరిగేలా చూడాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. అలాగే టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్‌ని షాపు వద్దకు పంపించారు.

పేకాటజూదరులు అరెస్టు.. నగదు స్వాధీనం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని గూడ్స్‌షెడ్ కొట్టాల ప్రాంతంలో శంకర్‌రెడ్డి స్కూల్ వద్ద నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి జూదరులను అరెస్టు చేసి, వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. స్థానిక టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం డీఎస్పీ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అందిన సమాచారం మేరకు పోలీసులు దాడులు చేసి పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 27,320 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారన్నారు. ధర్మవరం సబ్ డివిజన్‌లో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. పట్టణ పరిధిలో గ్యాంబ్లింగ్, మట్కా, ఇతర అక్రమ కార్యకలాపాలపై కట్టుదిట్టమైన నిఘా ఉంచుతామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాల గురించి తెలిస్తే ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టూ టౌన్ ఎస్ఐ విజయ్‌కుమార్, కానిస్టేబుల్ పాల్గొన్నారు.

కుట్టుమిషన్ పంపిణీ

ప్రజాశక్తి-కొత్తచెరువు


కుట్టుమిషన్ పంపిణీ చేసిన ట్రస్టు సభ్యులు

స్థానిక బిసి కాలనీకి చెందిన శివ భార్యకు కిద్‌మత్ ఏ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ జడ్పిటిసి లక్ష్మీనారాయణ ఆర్థికసాయంతో ఆదివారం కుట్టుమిషన్ పంపిణీ చేశారు. శివ ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వారి కుటుంబ పరిస్థితి తెలుసుకున్న ట్రస్ట్ సభ్యులు స్పందించి శివ భార్యకు కుట్టు మిషన్ పంపిణీ చేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శామీర్, సోహెల్, శ్రవణ్, శశి, తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య'

నమోదు ప్రక్రియ ప్రారంభం

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలో వ్యవసాయ భూమి కలిగిన ప్రతి రైతుకూ ఓ ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయిస్తామని, తద్వారా వ్యవసాయ సేవలను సులభం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకొస్తామని మండల వ్యవసాయ అధికారి వీరనరేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ పథకాలు, రాయితీలు, పంటల బీమా, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలు, ప్రయోజనాలు పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పని చేస్తుందని తెలిపారు. రైతులను గుర్తించడంలో కూడా తోడ్పడుతుందన్నారు. రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ

తనకల్లు : స్థానిక ఇందిరానగర్‌లో నివాసం ఉండే టిడిపి పంచాయతీ వార్డు మెంబర్ తిరుపల్లి దామోదర్‌కు గత నెలలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదివారం దామోదర్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అండగా ఉంటానని, అ ధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు.

14 నుంచి ప్రశాంతి నిలయంలో అతిరుద్ర మహాయజ్ఞం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

శ్రీసత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 14 నుంచి 25వ తేదీ వరకూ ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ హాలులో సత్యసాయి మహాసమాధి వద్ద వేద పండితుల ఆధ్వర్యంలో అతిరుద్ర మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు అఖిల భారత సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు పాండే ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ యజ్ఞం ప్రపంచవ్యాప్తంగా ప్రత్యక్ష ప్రసారం చేస్తామన్నారు. సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో దేశ విదేశీ భక్తులు పాల్గొంటారన్నారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం సాయి ఉపదేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇప్పటికే ట్రస్టు అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. నవంబర్ 23వ తేదీ వరకూ పలు కార్యక్రమాల నిర్వహణకు ట్రస్టు శ్రీకారం చుట్టిందన్నారు.

సొంత నిధులతో వంతెనకు మరమ్మతులు

గోరంట్ల : పట్టణంలో చిత్రావతి నదిపై నిర్మించిన వంతెనకు పై భాగంలో గుంతలు పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతుండేవారు. దీంతో స్పందించిన టిడిపి నాయకుడు నిమ్మల శ్రీధర్ సొంత నిధులతో వంతెనపై గుంతలకు మరమ్మతులు చేయించారు. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

రొద్దం : మండలంలోని ఆర్.మరవపల్లి గ్రామంలో వెలసిన శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయ 19వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం 24 గంటల పాటు భక్తి పాటలు ఆలపించారు. ఆదివారం ఉదయం వేద పండితులు హోమాలు నిర్వహించారు. మహిళలు జ్యోతులు ఎత్తుకొని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సత్సంగం, భక్తులకు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు.

జనసేనపార్టీలో పలువురు చేరిక

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని నాగలూరు గ్రామానికి చెందిన 50 వైసిపి కుటుంబాలు ఆదివారం జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి సమక్షంలో జనసేనపార్టీలో చేరాయి. చిలకం మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చి వైసిపి నుంచి జనసేన పార్టీలో చేరారన్నారు. కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారికి ఏ సమస్య వచ్చినా ముందుంటానని భరోసానిచ్చారు. జనసేనపార్టీలో చేరిన వారిలో ప్రకాష్‌రెడ్డి, చిన్న పక్కీరప్ప, రాజారెడ్డి, గోవిందరెడ్డి, అనిల్, నితీష్, లింగమయ్య, వెంకట రాముడు, కదిరప్ప, సాయికుమార్, నాగేంద్ర, గంగాద్రి, నరసింహుడు, శివయ్య, రమణ, ఆంజనేయులు, జయ సింహారెడ్డి, రాజశేఖర్, నరసింహులు, తదితరులు ఉన్నారు.

జనసేనలో చేరిన వారితో చిలకం